# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

## పచ్చని పంటల్లో ‘కౌలుదారు’ కుంపట్లు..!



- ప్రభుత్వ రికార్డుల్లోకి కౌలుదారు పేరు కూడా..
- యాజమాన్య హక్కులకు ఎసరు పెట్టే ప్రమాదం
- ఆ చట్టంతో మళ్లీ దళారుల రాజ్యం
- అమల్లోకి వస్తే కూలీల ఉపాధి దెబ్బతినే ఛాన్స్
- కాంగ్రెస్‌పై దుమ్మెత్తి పోస్తున్న రైతులు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : ‘కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కౌలుదారు చట్టం తీసుకొస్తాం’ ఇదీ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క స్వయంగా చేసిన కామెంట్. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. ఈ చట్టం తీసుకొస్తే రైతులకు ఉరే గతి అని ఆందోళన చెందుతున్నారు. దాని ప్రకారం రైతులు తమ భూమిని కౌలుకు ఇస్తే కచ్చితంగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదవుతుందని, దీంతో భూయజమాన్య హక్కులకే ఎసరు వచ్చే ప్రమాదం వస్తుందని గుబులు పడుతున్నారు. అంతేకాకుండా న్యాయంస్థానంలో నిలబెట్టే పరిస్థితి ప్రమాదం ఉంది. దీంతో పల్లెల్లో కౌలు చిచ్చు రాజుకోవడంతోపాటు ఊర్లలో ప్రశాంతత దెబ్బతింటుంది. రైతులు తమ భూములను కౌలుకు ఇవ్వడానికి వెనకాడుతారు. ఫలితంగా రైతులకు ఉపాధి మార్గాలు తగ్గడంతోపాటు ఉత్పత్తి, దిగుబడి తగ్గుతుంది. కౌలుచట్టం దళారీ రాజ్యానికి బార్లా తలుపులు తెరుస్తుంది. ఇలాంటి ప్రమాదకరమైన చట్టాన్ని కాంగ్రెస్ తీసుకొస్తామనడంతో రైతులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న రైతుల జీవితాల్లో కుంపట్లు పెడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను గెలవనీయబోమని, కౌలుదారు చట్టం ఆలోచన ఆదిలో తుంచేస్తామని ఘంటాపథంగా చెబుతున్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడతామని, కాంగ్రెస్ అభ్యర్థుల డిపాజిట్లను గల్లంతు చేస్తామని శపథం చేస్తున్నారు.

### కౌలుదారు చట్టంతో భూతగాదాలకు ఆజ్యం



తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొంది. పల్లెల్లో నెలకొన్న ప్రశాంతతను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు కౌవులుదారు చట్టం తెస్తామని చెబుతున్నారు. ఈ చట్టం తేస్తే ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో మళ్లీ భూతగాదాలు పెరిగి అశాంతి నెలకొంటుంది. సీఎం కేసీఆర్ రైతుల భూములకు భద్రత కల్పిస్తూ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు. ఇప్పుడు కౌలుకు ఇచ్చిన మా భూములకు భద్రత ఉంది. కర్మగాలి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే వారు తెచ్చే అడ్డమైన చట్టంతో భూ యాజమాన్య హక్కులకు ఎసరు వస్తుంది. కౌలుదారు చట్టంతో తమ భూములు ఎవరి పేరుపైకి వెళ్తుందోనని భయాందోళనలో బతకాల్సి వస్తుంది. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే మా మెడకు మేమే ఉరితాడు వేసుకున్నట్లు అవుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ మేము కాంగ్రెస్‌కు మద్దతివ్వం. కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ బీఆర్ఎస్సే అధికారంలోకి రావాలి.

–బిట్ల లక్ష్మీనరసింహారెడ్డి, రైతు, వీరారెడ్డిపల్లి, తుర్కపల్లి



### పట్వారీల పెత్తనంతో పరేషాన్



గతంలో తండ్రి నుంచి కొడుకు పేరున భూమి మార్చాలన్నప్పుడు పట్వారీల పెత్తనంతో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. పనులు కాక పరేషాన్ అవ్వాల్సి వచ్చేది. కానీ, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో ఆ భాదలు తొలిగిపోయాయి. ధరణి పోర్టల్ తీసుకొచ్చి భూ సమస్యలకు చెక్ పెట్టారు. రైతు పేరున 10 గుంటల భూమి భద్రంగా ఉండేది. అలాంటిది కాదని కాంగ్రెసోళ్లు ధరణిని రద్దు చేస్తామంటున్నరు. ధరణిని తీసేస్తే మునుపటి రోజులొస్తాయి. మళ్లీ భూమి రిజిస్ట్రేషన్ల కోసం దళారీల చుట్టూ తిరగాల్సి వస్తుంది. కాబట్టి ధరణిని రద్దు చేస్తామంటున్న కాంగ్రెసోళ్లకు అధికారం ఇవ్వొద్దు.

–యెంపల్ల అంజిరెడ్డి, రైతు, మన్నెవారిపంపు, భువనగిరి

### కౌలు చట్టంతో రైతులకు ఇబ్బంది

కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రైతులను ఆగం చేయాలని చూస్తుంది. ధరణి రద్దు చేసి భూమాత పోర్టల్ తెస్తామంటున్నారు. రెవెన్యూ రికార్డుల్లో పాతకాలం నాటి కాలాలు పెడుతామని చెబుతున్నారు. అలా చేస్తే గొడవలు జరుగడం ఖాయం. భూములకు రక్షణ ఉండదు. ఏండ్ల కొద్దీ భూమి దున్నుకునే వాళ్లదే భూమి అనే అవకాశం ఉంటుంది. దాంతో సమస్యలు పెరుగుతాయి. పట్వారీ, వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను తీసుకొస్తే మరిన్ని తిప్పలు తప్పవు. అధికారులు చేసిన తప్పులను సరిచేసేందుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. లంచాలు ఇవ్వనిదే పని కాదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణితో 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ అవుతుంది. త్వరగా పాస్ బుక్కులు వస్తున్నాయి. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలి.

–ఏనుగు జంగారెడ్డి, ఏనుగువాణిగూడెం, భూదాన్‌పోచంపల్లి



### కౌలుదారు చట్టంతో పంచాయతీలే..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కౌలుదారు చట్టం అమలు చేస్తామంటున్నారు. దాంతో కౌలుదారులకు, భూ యజమానులకు పంచాయతీలు జరుగడం ఖాయం. ఈ చట్టంతో రైతులకు కష్టాలు తప్పవు. భూ యజమానులు సాగు చేసే శక్తి లేకున్నా వారి భూమిని ప్రస్తుతం కౌలుకు ఇస్తున్నారు. కానీ ఈ చట్టం అమలు చేస్తే కౌలు రైతులు భూ యజమానులకు ఒప్పందం రాసి ఇవ్వాల్సి ఉంటుంది.. అప్పుడు ఒప్పందం సరిగ్గా జరుగకపోతే కౌలుదారులకు, భూ యజమానులకు సమస్యలు వచ్చే అవకాశం ఉంది.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భూ యజమానులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రస్తుతం సీఎం కేసీఆర్ హయాంలో అమలు చేస్తున్న ధరణితోనే రైతులకు ఇబ్బందులు లేవు. కాంగ్రెసోళ్లు వచ్చి ధరణి తీసేస్తే మళ్లీ పాత కథే ఐతది.


–పైళ్ల మైసిరెడ్డి, రైతు, మేడికుంటపల్లి, మోటకొండూర్



### ధరణి పోతే దళారులదే రాజ్యం

రైతుల మేలు కోరి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న ధరణితో రైతులు రాజులుగా ఉంటున్నారు. ధరణి తీసేస్తే రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. దళారులే రాజ్యమేలుతారు. రైతుల భూ హక్కుల కోసం తీసుకొచ్చిన ధరణిని దళారుల చేతిలో పెట్టేందుకు కాంగ్రెసోళ్లు కుట్ర పన్నుతున్నారు. ధరణి లేక ముందు భూమిని రికార్డుల్లోకి ఎక్కించాలంటే దళారులను ఆశ్రయించాల్సి వచ్చేది. రికార్డుల్లో ఒకరి భూమిని మరొకరి పేరుమీద రాసేవారు. మళ్లీ ఆ వ్యవస్థను తీసుకొస్తామంటున్న కాంగ్రెస్‌ను తరమికొట్టాలి.

– నన్నూరి రజినీకాంత్‌రెడ్డి, రామన్నపేట



రైతుల పచ్చని జీవితాల్లో కాంగ్రెస్ మంటలు రేపే కుట్ర చేస్తున్నది. ప్రశాంతంగా జీవిస్తున్న అన్నదాత కడుపుకొట్టే కుయుక్తులు పన్నుతున్నది. దేశానికే బువ్వగిన్నెగా మారిన తెలంగాణను ఆగం చేసే పన్నాగం పన్నుతున్నది. 24 గంటల కరెంట్ వద్దని, 3 గంటల కరెంట్ చాలని సల్లని చావు కబురు చెబుతున్నది. 10హెచ్‌పీ మోటర్లు బిగించుకోవాలని.. ఎద్దు, ఎవుసం గురించి తెలియకుండా ఉచిత సలహాలు ఇస్తున్నది. అసలు రైతుల వద్ద 10హెచ్‌పీ మోటర్లే ఉండవనే సోయి లేకుండా కాంగ్రెస్ నేతలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నది. రైతుల ఉపయోగించేవి 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లు అనే విషయం తెలియకుండా కారుకూతలు కూస్తున్నది. ఇట్లయితే ఉమ్మడి రాష్ట్రంలో లెక్క మళ్లీ మోటర్లు కాలుడు, ట్రాన్స్‌ఫార్మర్లు పేలుడు కథే ఉంటదని రైతులు భగ్గుమంటున్నారు. 10హెచ్‌పీ మోటర్లు కొంటే ఒక్కొక్కరిపై రూ.లక్షకు పైగా ఆర్థిక భారం ఎవరు భరిస్తారని ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో 24గంటల నాణ్యమైన కరెంట్ వస్తుందని, అలాంటి మంచి పాలనను ఎట్ల వదులుకుంటామని చెబుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ)

# కాంగ్రెస్‌ను బొంద పెడ్తాం

## 10హెచ్‌పీ మోటర్ల పేరెత్తితే భగ్గుమంటున్న అన్నదాత



### 10హెచ్‌పీ మోటర్లతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్

కాంగ్రెస్ పాలనలో కరెంట్ సమస్యతో నానా తంటాలు పడ్డం. పొలానికి నీరు సరిపోక ఎండిపోయేది. సీఎం కేసీఆర్ వచ్చినంక కరెంట్ బాధలు తీరినయ్. కాంగ్రెస్ పాలనలో రాత్రి పూట కరెంట్ ఇచ్చేటోళ్లు పంటలకు నీళ్లు పెట్టడానికి గోస పడేది. రాత్రి నిద్ర కూడా ఉండేది కాదు. అరిగోస పడుకుంటనే వ్యవసాయం చేసి కాలం ఎల్లదీసినం. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సార్ 24 గంటల కరెంట్ ఇవ్వడంతో రైతుల కష్టాలు తీరినయ్. సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నం. ఇప్పుడు రేవంత్‌రెడ్డి10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నడు. ఆయనకు వ్యవసాయం గురించి ఏం తెలుసు? అవగాహన లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరి కాదు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే కష్టాలు కొనితెచ్చుకున్నట్లే.


–చంద్రయ్య, రైతు, యాసాజ్‌గూడెం, ఆలేరు

### కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి



ఎవుసం జేసెటోళ్లకే రైతుల తిప్పలు తెలుస్తాయి. సీఎం కేసీఆర్ సారు వచ్చినంక ఎవుసం బాగుపడ్డది. ఇరాం లేకుండా కరెంట్ ఇస్తుంటే పుష్కలంగా పంటలు పండుతున్నాయి. రైతన్నలను ఆదుకోవాలనే ఉద్దేశంతో దేవుడి లెక్క రైతుబంధుతో ప్రతి కారుకు పెట్టుబడి సాయం అందిస్తుండు. అప్పుల కోసం షావుకార్ల ఇండ్లకు తిరిగే తిప్పలు తప్పినయి. పండుగలా ఎవుసం జేసుకుంటూ బాగుపడుతున్నం. ఎవుసం గురించి తెలియని కాంగ్రెసోళ్ల మాట నమ్మితే నిండా మునుగుతాం. పూటకో మాట చెప్తూ ఆగం జేస్తుండ్రు. 3 గంటల కరెంట్‌తో ఎకరం కూడా పారదు. పెద్ద మోటర్లు పెట్టుకుంటే ఓవర్‌లోడ్‌తో మోటర్లు కాలిపోతాయి. రిపేర్ల కోసం మళ్లీ మెకానిక్‌ల చుట్టూ తిరుగాల్సి వస్తది. కాంగ్రెసోళ్లకు అధికారం అప్పగిస్తే మళ్లా ఎవుసం పడావు పడుతది. గిప్పుడు దర్జాగా ఎవుసం జేసుకుంటున్న రైతులను ఆగం చేసేందుకు కాంగ్రెసోళ్లు కుట్ర చేస్తున్నరు. వాళ్ల మాటలు ఏ మాత్రం నమ్మొద్దు. రైతుల బతుకుల్లో మట్టికొడుదామనుకుంటున్న కాంగ్రెసోళ్లను ఎలక్షన్లలో తరిమికొట్టాలి.

–సూదగాని అంజయ్య, రైతు, కొత్తజాల, రాజాపేట






### రేవంత్‌రెడ్డి మాటలు నమ్మితే ఆత్మహత్యలే..

నాకు మా ఊరిలో ఎకరం పొలం ఉంది. దానికి తోడు ఏడెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నా. కాంగ్రెస్ హయాంలో కరెంట్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక నానా తంటాలు పడేవాళ్లం. రాత్రిపూట కరెంటుతో పాములు, తేళ్లతో భయంభయంగా బతికేవాళ్లం. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రైతుల బతుకులు మారాయి. ఈక్రమంలో రైతులకు 3 గంటల కరెంటు చాలంటున్న రేవంత్‌రెడ్డి మాటలు నమ్మితే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం.10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్న రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి తెలిస్తే అలా మాట్లాడడు. 10 హెచ్‌పీ మోటర్ కొనాలంటే రూ.లక్ష ఖర్చు అవుతుంది. రేవంత్‌రెడ్డి బట్టేబాజ్ మాటలు నమ్మితే రైతులు నిండా మునగాల్సిందే. కాంగ్రెస్ అధికారంలోకి రావొద్దు.. రైతుల బతుకలను బజారున పడేయవద్దు. కేసీఆర్ సార్ ఇస్తున్న 24 గంటల కరెంటు, రైతుబీమా, రైతుబంధు పథకాలతో రైతులంతా సంతోషంగా ఉన్నారు. రైతులంతా రాజులు కావాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం.

–కిష్టం తిరుమలేశ్, రైతు, సంస్థాన్‌నారాయణపురం, యాదాద్రిభువనగిరి జిల్లా

### 10 హెచ్‌పీ మోటర్ ఎవరు కొనియ్యాలె

అప్పట్లో కాంగ్రెస్ సర్కారు 3 గంటల కరెంటే ఇచ్చింది. ఇచ్చిన కరెంట్ సరిగ్గా లేక ఎవుసం ఆగమైంది. నెలకు రెండు, మూడుసార్లు మోటర్లు కాలిపోయినయ్. రాత్రిపూట పొలాల కాడ జాగారం చేసేవాళ్లం. పాములు, తేళ్లు కుట్టేవి. నేడు తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల మంచి కరెంటు వస్తున్నది. సీఎం కేసీఆర్ పాలనలో మోటర్లు కాలుత లేవు. ఎప్పుడంటే అప్పుడు పొలానికి పోయి మోటరు పెట్టుకుని నీళ్లు పారించుకుంటున్నం. మళ్లీ ఇప్పుడు కాంగ్రెసోళ్లు ఎవుసానికి 3 గంటల కరెంట్ ఇస్తమని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నరు. ఇంత పెద్ద మోటరు ఎవరు కొనియాలె? కాంగ్రెసోళ్లు కొనిస్తారా? కాంగ్రెస్ వస్తే మళ్లీ పాత రోజులొస్తయ్. రైతులంతా జాగ్రత్తగా ఉండి సీఎం కేసీఆర్‌నే మళ్లీ గెలిపించుకోవాలి.

– కొకుంట్ల రామచంద్రారెడ్డి, రైతు, చొల్లేరు, యాదగిరిగుట్ట



### 3 గంటల కరెంటుతో పొలాలు పారుతాయా?

మాకు 10 ఎకరాల భూమి ఉంది. గతంలో మేము కరెంట్ కష్టాలతో ఒకటే పంట పండించేవాళ్లం. ఇప్పుడు సీఎం కేసీఆర్ సార్ రైతులకు 24గంటల కరెంట్ ఇస్తుండు. దాంతో రెండు పంటలు పండిస్తున్నం. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి అన్నట్లు రైతులకు 3 గంటల కరెంట్ ఎట్లా సరిపోతది? 3 గంటల్లో 10 ఎకరాలు ఎలా పారియ్యాలె? అంతేకాకుండా 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నరు. 10హెచ్‌పీ మోటర్లు పెడితే బోర్లు ఉంటాయా? నీళ్లు పాతాళంలోకి వెళ్తాయి. పొలాలు పారేది ఎట్లా? కాంగ్రెసోళ్ల మాటలు నమ్మకుండా 24గంటల కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ సర్కారుకు అండగా ఉందాం.

–నిమ్మరెడ్డి నరేందర్‌రెడ్డి, రైతు, పల్లెర్ల, ఆత్మకూరు(ఎం)



### 10హెచ్‌పీ మోటర్లతో ఆర్థిక భారం

కాంగ్రెసోళ్లు చెప్పినట్టు 10 హెచ్‌పీ మోటర్లు వాడాలంటే వాటి ఖర్చు తడిసి మోపెడవుతుంది. వాటిని ఎవరు కొనాలి? ఎక్కడ కొనాలి? ఇవన్నీ రైతులను ఇబ్బందులు పెట్టే మాటలు తప్ప వారికి మేలుచేసే పనులు కావు. సీఎం కేసీఆర్ ఉచిత విద్యుత్ ఇస్తుంటే కాంగ్రెసోళ్లకు మింగుడు పడడం లేదు. ఉచిత కరెంట్‌పై లేనిపోని రాద్ధాంతం చేసి రైతులను వాళ్ల దిక్కు తిప్పుకోవాలని చూస్తున్నరు. అందుకే 10 హెచ్‌పీ మోటర్ల నాటకం ఆడుతుండ్రు. ప్రస్తుతం 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లతో బోర్లు రోజంతా పోస్తున్నాయి. 10హెచ్‌పీ వాడితే ఉన్నది పోగొట్టుకోవాల్సిందే. కాంగ్రెసోళ్లు చెప్పే మాటలు వినేందుకు రైతులు సిద్ధంగా లేరు. రైతుల మేలుకోరే సీఎం కేసీఆర్ వెంటే ఉంటాం.

–అంకర్ల బాలరాజు, మన్నెవారిపంపు, భువనగిరి

